క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో బాజీరావు పల్లకి ఊరేగింపు



పల్లకి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

తాంసి: మండలంలోని పొన్నారి గ్రామంలో శనివారం బాజీరావ్ బాబా పల్లకిని గ్రామస్తులు ఊరేగించారు. ఆధ్యాత్మిక గురువు బాజీరావ్ మహరాజ్ పుణ్యతిథి వేడుకల్లో భాగంగా పల్లకిలో బాజీరావ్ మహరాజ్ చిత్రపటాన్ని ఉంచి భజన సంకీర్తనలతో ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు నారాయణ, రాకేశ్, గంగన్న, స్వామి, రామన్న, తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు



పాల్గొన్న విద్యార్థులు, పాఠకులు

ఆదిలాబాద్: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'గ్రంథాలయాలు వాటి ప్రాముఖ్యత' అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యాసరచన పోటీల్లో అత్యుత్తమమైన వాటిని ఎంపిక చేసి ఈనెల 20న జరిగే ముగింపు వేడుకల్లో విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తాంసి: రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్ డిమాండ్ చేశారు. శనివారం భీంపూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం గత నాలుగేళ్లుగా బకాయిలు చెల్లించడం లేదన్నారు. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు అంకిత్, అభిషేక్, నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీ పరిశీలన



పైపులైన్ లీకేజీని పరిశీలిస్తున్న చైర్మన్ జోగు ప్రేమేందర్

కై లాస్‌నగర్: పైపులైన్ లీకేజీని అరికట్టి ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అధికారులను ఆదేశించారు. శనివారం పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌లోని మిషన్ భగీరథ వాటర్ పైప్‌లైన్ లీకేజీ మరమ్మతులపై వార్డు కౌన్సిలర్ భర్త సలీం పాషా చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు స్పందించిన ఆయన మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పైపులైన్ లీకేజీనీ పరిశీలించారు. తక్షణమే మరమ్మతులు చేయాలన్నారు. ఆయన వెంట డీఈలు కార్తీక్, అరుణ్, సిబ్బంది ఉన్నారు.

మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగాలి



గీసిన చిత్రాలు చూపిస్తున్న విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్ (జైనథ్): విద్యార్థులు మహనీయులను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని జైనథ్ కేజీబీవీ ప్రత్యేకాధికారి మీనా కుమారీ అన్నారు. బిర్సాముండా 150 జయంతి ఉత్సవాల సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 26వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లుగా పేర్కొన్నారు. కార్యక్రమంలో కేజీబీవీపీ సీఆర్‌టీలు, సిబ్బంది పాల్గొన్నారు.

చదువు సాగేదెలా..?

- పది పాఠశాలల్లో భర్తీ కాని ఉపాధ్యాయుల పోస్టులు
- ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టని ఐటీడీఏ అధికారులు



అలిగూడలో చదువుకు దూరమైన చిన్నారులు



మూతబడిన పున్నగూడ పాఠశాల

నార్నూర్: సర్కారు బడిలో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం విద్యా అందని ద్రాక్షగానే మారుతోంది. గ్రామాల్లోని పాఠశాలలో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు వ్యవసాయ కూలీలుగా, డ్రాఫౌట్‌గా మారుతున్నారు. దీంతో విద్యాభివృద్ధి కుంటుపడుతుంది. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన ఉపాధ్యాయులు, సీఆర్‌టీల బదీలతో మారుమూల గ్రామాల పాఠశాలలో పోస్టింగ్‌లు ఎవరూ తీసుకోకపోవడంతో పాఠశాలలు తెరుచుకోలేదు. కనీసం ఐటీడీఏ అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోవడంపై ఆదివాసీ గిరిజన సంఘాలు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు ఆడుకుంటూ.. కొందరు, మరి కొందరు కుటుంబ సభ్యులకు ఆసరాగా ఉంటున్నారు.

10 పాఠశాలలో ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీ..

జిల్లాలోనే మారుమూల మండలమైన గాదిగూడ మండలంలో ఆదివాసీ గిరిజనులు అధికంగా నివాసం ఉంటున్నారు. మొత్తం 25 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మొత్తం పది గ్రామాల్లోని పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడంతో పాఠశాలలు తెరుచుకోలేదు. దీంతో గిరిజన విద్యార్థులకు విద్య అందడం లేదు. మండలంలోని పున్నగూడ, రుప్పాపూర్, శివనారా, అలిగూడ, సెడ్వాయి, కొలామా, మారెగాం, హిరాపూర్, చిన్నకుండి, కొత్తపల్లి(జీ) గ్రామాల్లోని పాఠశాలలో ఉపాధ్యాయులు లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఒకొక్క పాఠశాలలో దాదాపు 20 నుంచి 30 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఉపాధ్యాయులు లేకపోవడంతో ఆరుబయటే ఆడుతూ కాలయాపన చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉపాధ్యాయులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపాధ్యాయులను నియమించాలి



ఏజెన్సీ ప్రాంతంలో ఐటీడీఏ ఉన్నత విద్యపై దృష్టి సారించకపోవడంతో గిరి విద్యార్థులకు విద్య అందడం లేదు. పది పాఠశాలలో ఉపాధ్యాయలు లేకపోవడం బాధకారం. ప్రత్యామ్నయ చర్యలు తీసుకొని ఉపాధ్యాయులను నియమించాలి.

– పెందూర్ సంతోష్, విద్యార్థి సంఘం నాయకుడు

విద్యార్థుల భవిష్యత్‌పై దృష్టి సారించాలి



పేద విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఐటీడీఏ అధికారులు ఉపాధ్యాయులను నియమించాలి. ఉపాధ్యాయులు లేక 10 పాఠశాలలు మూతపడి ఉన్నాయి. ఇప్పటికే ఐటీడీఏ పీవోను కలిసి వినతిపత్రం అందించినా.. ఫలితం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉపాధ్యాయులను నియమించాలి.

– మధు, విద్యార్థి సంఘం నాయకుడు

సీఎం రేవంత్‌రెడ్డి సభలో పాల్గొన్న 'కంది'



సీఎం సభలో పాల్గొన్న కంది శ్రీనివాసరెడ్డి



ఓటును అభ్యర్థిస్తున్న నాయకులు

కై లాస్‌నగర్: పీసీసీ రాష్ట్ర మాజీ వ్యవహారాల ఇన్‌చార్జి, దిగ్రస్ అసెంబ్లీ అభ్యర్థి మాణిక్ ఠాక్రేకు మద్దతుగా శనివారం మహారాష్ట్రలోని దిగ్రస్ నియోజకవర్గ పరిధిలోని నేర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారసభలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. అలాగే ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అమలు చేస్తున్న పథకాలను వివరించారు. బుద్ధి చెప్పాలంటే కాంగ్రెస్‌ను గెలిపించి, తమ అభివృద్ధికి బాటలు వేయాలన్నారు.

- మహారాష్ట్రలోని రాజుర నియోజకవర్గ కేంద్రంలో శనివారం జరిగిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బహిరంగసభకు బేల మండల కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి ఆధ్వర్యంలో తరలివెళ్లిన నాయకులు అక్కడి కాంగ్రెస్ అభ్యర్థి సుభాష్ డోటేకు మద్దతుగా సభలో పాల్గొన్నారు. బేల మండల అధ్యక్షుడు ఫైజుల్లా ఖాన్, మాజీ జెడ్పీటీసీ రాందాస్ నాక్లే, జైనథ్ మార్కెట్ వైస్ చైర్మన్ విలాస్ పటేల్, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఘన్ శ్యామ్, అవినాష్, మడవి చంద్రకాంత్, సాగర్, శంకర్, విజయ్, కరీం, భాస్కర్ పాల్గొన్నారు.

'మహా' ఎన్నికల ప్రచారంలో జిల్లా నాయకులు

కై లాస్‌నగర్: మహారాష్ట్రలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, కాంగ్రెస్ కూటమి భారీ మెజార్టీతో అధికారంలోకి రావడం ఖాయమని ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శనివారం మహారాష్ట్రలోని యవత్మాల్ జిల్లా అర్ని అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి జితేందర్ శివాజీ రావు మోగేతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అక్కడి ప్రజలకు వివరిస్తూ.. కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయాలని కోరారు. నాయకులు నవీన్, సుభాష్ షిండే, అమృత, సలాం, బాలేరావ్, విట్టల్, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ చైర్మన్ పదవి ఇవ్వాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నవీన్‌రెడ్డి

కైలాస్‌నగర్: కాంగ్రెస్ అధికారంలో ఉన్నా.. లేకున్నా 2004 నుంచి పార్టీ కోసమే అహర్నిశలు కృషి చేస్తున్న తనకు ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వాలని కాంగ్రెస్ నాయకుడు నలిమెల నవీన్ రెడ్డి కోరారు. శనివారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. మాజీ మంత్రి, దివంగత చిల్కూరి రాంచంద్రారెడ్డి వెన్నంటే ఉంటూ, పార్టీ ఎవరికీ టికెట్ కేటాయించినా విధేయతతో వారి విజయం కోసం కృషి చేయడం జరిగిందని పేర్కొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే ప్రభుత్వ ఉద్యోగాలు



సన్మానిస్తున్న మాజీ జెడ్పీటీసీ గణేష్ రెడ్డి, గ్రామస్తులు

తలమడుగు: కాంగ్రెస్ హయాంలోనే నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయని మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఖోడద్ గ్రామంలో గ్రూప్-4లో సాకే ప్రణీత్, మిటిపెల్లి సంతోష్, డీఎస్సీలో ఉపాధ్యాయుడిగా నల్ల ప్రశాంత్‌లు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంతో వారిని ఘనంగా సన్మానించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. కేవలం నాయకులకే పదవులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కల్యాణం లక్ష్మి రాజేశ్వర్, మాజీ సర్పంచులు సాకే ఆనంద్, పురుషోత్తం, వెంకన్న యాదవ్, బాబు ఖాన్, నారాయణ రెడ్డి, విలాస్ యాదవ్, రావుల నారాయణ పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న గ్రామస్తులు

బోథ్: మండల కేంద్రానికి చెందిన టేకులపల్లి మౌనిక అనే విద్యార్థికి ఓ ప్రైవేట్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్‌లో సీటు వచ్చింది. కానీ ఫీజు చెల్లించేందుకు డబ్బులు లేకపోవడంతో చదవలేని పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని స్థానికుడు సామాజిక కార్యకర్త అనిల్ మాసం ద్వారా తెలుసుకున్న అమెరికాలోని ఫిలడెల్ఫియా తెలంగాణ అసోసియేట్ వారు రూ. 50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. డీడీని శని వారం మౌనికకు అందజేశారు. కార్యక్రమంలో పోటీ పరీక్షల నిపుణులు రమణ గౌడ్, సాయికృష్ణ, అనిల్ మాసం, తుల హరీష్, గంగాధర్, రమేశ్, పోసాని, కృష్ణ, సుగుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న పెందూర్ దాదిరావు

నార్నూర్: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న నిరుపేద గిరిజన విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు పెందూర్ దాదిరావు డిమాండ్ చేశారు. శనివారం గాదిగూడ మండలంలోని లోకారి మినీ గురుకులం, ఝరి ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. పేద విద్యార్థుల చదువు కోసం ప్రభుత్వం కోట్ల రుపాయలు ఖర్చు పెడుతున్నా.. క్షేత్ర స్థాయిలో మాత్రం కనీస సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చలికాలం ప్రారంభం కావడంతో వసతి గృహాల్లో విద్యార్థులకు దుప్పట్లు లేక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కొన్ని గదులకు కిటికీలు లేకపోవడంతో అలాగే నిద్ర పోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తేనే వారు మంచిగా చదువుతూ అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవటానికి అవకాశం ఉందన్నారు. పాఠశాలలో విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూర్ సంతోష్, ఉపాధ్యక్షుడు మధు, తదితరులు పాల్గొన్నారు.

'మహారాష్ట్రలో బీజేపీ కూటమిదే అధికారం'



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కూటమిదే అధికారమని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శనివారం మహారాష్ట్రలోని వార్ధా అసెంబ్లీ నియోజకవర్గంలోని దంతోలి పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ హయాంలోనే మహారాష్ట్రలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. స్థానిక బీజేపీ అభ్యర్థి పంకజ్ పైన ప్రజలు ఎంతో నమ్మకంతో ఉన్నారని, ఆయన గెలుపు తథ్యం అన్నారు. పార్టీ కార్యకర్తలు ఎంతగానో శ్రమిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ గెలిచేందుకు ఇష్టారీతిన హామీలు ఇవ్వడం సరికాదన్నారు. ఎన్ని వాగ్దానాలు చేసినా.. లాభం లేదన్నారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలకు పాతర..!

- అస్తవ్యస్తంగా అంతర్రాష్ట్ర రోడ్డు నిర్మాణ పనులు
- కానరాని నిబంధనలు, రక్షణ చర్యలు
- ప్రమాదాల బారిన వాహనదారులు



కల్వర్టు నిర్మాణం వద్ద ఏర్పాటు చేయని సూచికలు

తాంసి: భీంపూర్ మండలంలోని నిపాని నుంచి సావర్గాం వరకు కొనసాగుతున్న అంతర్రాష్ట్ర రోడ్డు నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయి. రోడ్డు పనులు ఇష్టానుసారంగా చేపడుతుండడంతో మండల వాసులకు, వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. తాంసి మండలంలోని సావర్గాం నుంచి భీంపూర్ మండలంలోని ఇందూర్‌పల్లి వరకు 9 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.18 కోట్లు కేటాయించింది. కాగా పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ప్రస్తుతం సావర్గాం నుంచి నిపాని వరకు ఉన్న పాత రోడ్డును తొలగించి రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నాడు. పలు చోట్ల కల్వర్టుల నిర్మాణం చేపడుతున్నారు. రోడ్డు నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నా.. రక్షణ చర్యలు మాత్రం అంతంతగానే ఉన్నాయి.

చోటు చేసుకుంటున్న ప్రమాదాలు..

కల్వర్టు నిర్మాణం కోసం రోడ్డును అడ్డంగా తవ్వి పక్కనుంచి దారిని ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గత రెండేళ్ల క్రితం అంతర్రాష్ట్ర రోడ్డుపై లక్ష్మీపూర్ గ్రామశివారులో కల్వర్ట్ నిర్మించే సమయంలో ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో మండలంలోని కమట్‌వాడ గ్రామానికి చెందిన యువకుడు బైక్‌పై నుంచి కల్వర్టు కోసం తవ్విన గుంతలో పడి మృతి చెందాడు. కల్వర్టు నిర్మాణం జరిగే చోట దారి మళ్లింపు సిగ్నల్స్, రేడియం స్టిక్కర్స్, వేగ నియంత్రణ కోసం ఏర్పాటు చేయాల్సిన సూచికలు ఏర్పాటు చేయలేదు. అలాగే పాత రోడ్డును విస్తరణలో భాగంగా తవ్వి అలాగే వదిలేయడంతో దుమ్ముతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనుల్లో నిబంధనలు పాటించడంతో పాటు రక్షణ చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: రైల్వే డీఆర్‌యూసీసీ మెంబర్‌గా నియమాకమైన ఉష్కం రఘుపతిని ఆదిలాబాద్ పట్టణానికి చెందిన పలువురు శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. రైల్వే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, జిల్లాకు మరిన్ని రైళ్లు పొడగించేలా చూడాలని కోరారు. సన్మానించిన వారిలో బీజేపీ నాయకుడు సామ కృష్ణారెడ్డి, కస్తాల అరుణ్ కుమార్, క్రాంతికుమార్, అఖిల్, సృజన్, తదితరులు పాల్గొన్నారు.

ఏటీడీడీవోగా బాధ్యతలు స్వీకరించిన అనిల్

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ నిహారిక మెటర్నిటి సెలవుపై వెళ్లడంతో (ఏటీడీవో) అనిల్ శుక్రవారం ఏటీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఇదిలా ఉండగా అనిల్ ఇచ్చోడ గిరిజన ఆశ్రమ పాఠశాల హెచ్‌డబ్ల్యూవోగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఏటీడీవోగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను ఆ శాఖ ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

18న గ్రామసభ

ఇచ్చోడ: ఈనెల 18న ఉదయం 11 గంటలకు ఇచ్చోడ మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి సూర్యప్రకాశ్ తెలిపారు. ఎంపీడీవో లక్ష్మణ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామస్తుల హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.

అన్నిరంగాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఇంద్రవెల్లి: అన్నిరంగాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ఏఎంసీ చైర్మన్ సోమసే వెంకట్‌రామ్‌ను పరామర్శించారు. రిమ్స్ డైరెక్టర్‌తో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ధనోరా గ్రామానికి సందర్శించి గ్రామస్తులతో సమవేశమయ్యారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి గ్రామాల్లో నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: ఆధ్యాత్మిక మార్గంతోనే అభివృద్ధి సాధ్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని దనోర(బి) గ్రామాల్లో నిర్వహించిన కార్తీక మాసం ముగింపు పూజలకు హాజరయ్యారు. ముందుగా విఠల రుక్మాయి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడి అరెస్టు



టు టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏబీవీపీ నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: బాసర ట్రిపుల్ ఐటీలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని స్వాతి కుటుంబానికి న్యాయం చేయాలని, ఏబీవీపీ విద్యార్థి సంఘ నాయకులపై దాడి చేసిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపునిచ్చిన సంగతి తెల్సిందే. ఈ నేపథ్యంలో బాసరకు వెళ్తరనే ఉద్దేశంతో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నిఖిల్ ఒడ్నాలను టు టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విద్యార్థి సంఘాల నాయకుల అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని ఆయన పేర్కొన్నారు.

ముందస్తు అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: ఏబీవీపీ నిర్మల్ జిల్లాలోని ట్రిపుల్ ఐటీ ముట్టడికి పిలుపునివ్వడంతో మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని నలుగురు ఏబీవీపీ నాయకులను శనివారం ముందస్తుగా అరెస్టు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు.

వృద్ధాశ్రమానికి రూ. 20వేలు విరాళం



చెక్కు అందజేస్తున్న జిల్లా విద్యుత్‌శాఖ అధికారి చౌహాన్

తలమడుగు: తలమడుగు మండలంలోని సాయిలింగి వృద్ధాశ్రమానికి విద్యుత్ శాఖ సీఎండీ వరుణ్ రెడ్డి ప్రోత్సాహంతో విద్యుత్‌శాఖ ద్వారా ప్రతీనెల రూ. 20 వేలు అందిస్తామని జిల్లా విద్యుత్‌శాఖ అధికారి ఎస్సీ చౌహాన్ అన్నారు. శనివారం సాయిలింగి వృద్ధాశ్రమంలో నిర్వాహకులకు రూ. 20 వేల చెక్కు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృద్ధులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. అనంతరం విద్యుత్‌శాఖ అధికారులు వృద్ధులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు అశోక్, ఏఈ సతీష్, హరికృష్ణ, ప్రభాకర్, దిగంబర్, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.